క్లుప్తంగా

కొండగట్టులో మేడిపల్లి సత్యం పూజలు



ఆలయం ఎదుట కార్యకర్తలతో సత్యం

కొండగట్టు: కొండగట్టు శ్రీఆంజనేయ స్వామి వారిని శనివారం చొప్పదండి అసెంబ్లీ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మేడిపల్లి సత్యం దర్శించుకుని పూజలు నిర్వహించారు. నేడు ఎన్నికల తీర్పు వెలువడుతున్న నేపథ్యంలో స్వామివారి దయతో భారీ మెజారిటీతో గెలుపొంది రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలని మొక్కుకున్నట్లు సాక్షికి తెలిపారు. ఆయన వెంట నాయకులు ఆదిరెడ్డి, బత్తిని శ్రీనివాస్,ముత్యం శంకర్,గాజుల అజయ్ తదితరులు ఉన్నారు.

బియ్యం అందజేత



బియ్యం అందజేసిన ప్రతినిధులు

రామడుగు: మండల కేంద్రానికి చెందిన తోట సత్యం తన ప్రతినిధులు అనిల్ ద్వారా తల్లిదండ్రులు తోట బుచ్చమ్మ-వెంకటయ్య జ్ఞాపకార్థం దాదాపు 60 మంది పేదలకు తన ఇంటి వద్ద బియ్యం అందజేశారు. ఈసందర్భంగా తోట సత్యం పేదల సమస్యలను తెలుసుకొని అండగా ఉంటానని, అవసరాలు తీర్చడం ధ్యేయంగా తనవంతు సహాయ సహకారం అందజేస్తానని చెప్పారు. ప్రతినెలా ఒకటో తేదీన బియ్యం అందజేస్తామని చెప్పారు. ఏ ఒక్కరు ఆకలితో ఇబ్బంది పడొద్దనే ఆలోచనతో గ్రామస్తులకు బియ్యం అందజేస్తున్నట్లు వివరించారు.

సంబరాలకు అనుమతి లేదు

సైదాపూర్: ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత నిర్వహించే సంబురాలకు ఎలాంటి అనుమతి లేదని, సంబురాలు చేసిన వారిపై కేసులు నమోదు చేస్తామని సైదాపూర్ ఎస్‌ఐ ఆరోగ్యం శనివారం విలేకరుల సమావేశంలో తెలిపారు. ఆదివారం ఎలక్షన్ కౌంటింగ్ ఉన్నందున ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు 144 సెక్షన్ అమల్లో ఉంటుందని, ర్యాలీలు నిర్వహించినా, టపాసులు పేల్చి, డీజేలు పెట్టినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. రెచ్చగొట్టే ప్రసంగాలు చేయకూడదని, నలుగురి కంటే ఎక్కువ మంది గుమిగూడవద్దన్నారు. పూర్తి ఫలితాలు వచ్చిన తర్వాత ఎలక్షన్ కమిషన్ అనుమతితో మాత్రమే విజయోత్సవాలు నిర్వహించుకోవాలని, నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

పొన్నంకు శుభాకాంక్షలు

కరీంనగర్‌రూరల్: మాజీ ఎంపీ, కాంగ్రెస్ హుస్నాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి పొన్నం ప్రభాకర్‌ను శనివారం హుస్నాబాద్‌లో కరీంనగర్ మండల కాంగ్రెస్ నాయకులు కలిశారు. పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యేగా గెలుస్తున్నారని, తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడుతుందంటూ ప్రభాకర్‌ను అభినందించారు. కలిసిన వారిలో మండల నాయకులు మాసం సుధాకర్, ఆవుల గౌతమ్, బుచ్చాల అనిల్, గసికంటి శ్రీనివాస్ తదితరులున్నారు.

అల్పాహారం పంపిణీ

కరీంనగర్‌రూరల్: లయన్స్ ఇంటర్నేషనల్ జిల్లా 320జీ ఆధ్వర్యంలో మీల్స్ ఆన్ వీల్స్ ద్వారా శనివారం మాతా శిశు ఆస్పత్రి ఆవరణలో రోగులతో పాటు బంధువులకు అల్పాహారం పంపిణీ చేశారు. లయన్స్ క్లబ్ సభ్యులు కిషన్, చక్రాధర్-స్వాతి దంపతులు, నవీన్, కృష్ణకిశోర్, వెంకటరమణారెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, ఎడ్ల శ్రీనివాస్‌రెడ్డి, కోమల్‌రెడ్డి పాల్గొన్నారు.

అల్ఫాబెట్ జంగల్

కొత్తపల్లి: రేకుర్తిలోని సెయింట్ జార్జ్ నినోస్ బ్లాక్(సీబీఎస్‌ఈ)లో శనివారం అల్ఫాబెట్ జంగల్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏ టూ జెడ్ వరకు గల జంతువుల వేషధారణలో విద్యార్థులు ఆకట్టుకున్నారు. ఇలా చేయడం ద్వారా విద్యార్థులు జంతువుల పేర్లను సులభంగా గుర్తుంచుకునే అవకాశముంటుందని సెయింట్‌జార్జ్, ప్యారడైజ్ విద్యాసంస్థల చైర్మన్ డా.పి.ఫాతిమారెడ్డి తెలిపారు. ఇన్‌చార్జి సంధ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ మృతి

కరీంనగర్‌రూరల్: తీగలగుట్టపల్లి మాజీ సర్పంచ్ కాశెట్టి రంగమ్మ(85) అనారోగ్యంతో శుక్రవారం మృతిచెందారు. కరీంనగర్ కార్పొరేషన్‌లో విలీనం కాకముందు 2001 నుంచి 2005 వరకు తీగలగుట్టపల్లి సర్పంచ్‌గాఎని చేశారు. శనివారం రంగమ్మ మృతదేహానికి పలువురు ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు నివాళులర్పించారు. చిన్న కుమారుడు కాశెట్టి శ్రీనివాస్ రైతుబంధు సమితి కరీంనగర్ మండల కోఆర్డినేటర్, కోడలు లావణ్య రెండో డివిజన్ కార్పొరేటర్. మృతురాలికి ఇద్దరు కుమారులు కాశెట్టి లక్ష్మణ్, శ్రీనివాస్‌తో పాటు ముగ్గురు కూతుళ్లున్నారు. మధ్యాహ్నం కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తుల అశ్రునయనాల నడుమ అంత్యక్రియలు పూర్తి చేశారు.

తాగునీటికి తండ్లాటేనా..!

- ఫలించని మిషన్ భగీరథ పథకం.. తప్పని నీటి తిప్పలు
- రాబోయే వేసవిలో కష్టాలు పడాల్సిందేనా
- వాటర్ ప్లాంట్లను ఆశ్రయిస్తున్న ప్రజలు

మానకొండూర్‌రూరల్: గ్రామాల్లోని ప్రజలు ఫ్లోరైడ్ నీరు తాగుతూ రోగాల బారిన పడుతున్నారని, అనేక అనారోగ్య సమస్యలతో ఆర్థికంగా నష్టపోతున్నారని రాష్ట్ర ప్రభుత్వం 2015లో మిషన్ భగీరథ పథకం ప్రారంభించింది. కానీ అరకొర నీటి సరఫరాతో పాటు పూర్తి స్థాయిలో పనులు పూర్తి చేయకపోవడంతో భగీరథ నీరందక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. 2019లో పథకం పూర్తయిందని అధికారులు, నాయకులు చెబుతున్నారు తప్పా ఇప్పటికీ కొన్ని గ్రామాల్లోని ట్యాంక్‌లకు సరిపడా నీటి సరఫరా అందడం లేదు. కొన్ని గ్రామాల్లోని ఇళ్లకు ఇంకా నల్లా కనెక్షన్లు ఇవ్వకపోవడంతో ప్రజలు తాగునీటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నాసిరకం పనులు, నాణ్యతాలోపంతో పైప్‌లైన్ల ద్వారా నీటి సరఫరాలో తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. తరచూ పైపుల లీకేజీతో నీరంతా వృథాగా పోతున్నా సరైన చర్యలు చేపట్టడంలో అధికారులు విఫలమవుతున్నారనే విమర్శలు వెలువడుతున్నాయి. ప్రతి ఇంటికీ వెయ్యి లీటర్ల చొప్పున నీటిని అందిస్తున్నామని అధికారులు చెబుతున్నా వారి ఉదాసీన వైఖరి వల్లనే సమస్యలు అధికమవుతున్నాయని ప్రజలు బాహాటంగానే చర్చించుకుంటున్నారు. రాబోయే వేసవిలో తాగునీటికి కష్టాలు పడాల్సిందేనా అంటూ ఆందోళన చెందుతున్నారు.





పూర్తిస్థాయిలో నిండుకోని మానకొండూర్, నిజాయితీగూడెంలోని వాటర్ ట్యాంకులు

- మండలంలోని 27 గ్రామాలలో 36 పాత, కొత్త వాటర్ ట్యాంక్‌లను నిర్మించారు. వీటి ద్వారా 148కి.మీ వరకు పైప్‌లైన్లు ఏర్పాటు చేసి సుమారుగా 17,000 కుటుంబాలకు నీటిని అందిస్తున్నామనేది అధికారుల మాట. అయినా నిజాయితీగూడెం, పెద్దూర్‌పల్లి, చెంజర్ల, మానకొండూర్, వేగురుపల్లి, పచ్చునూర్, ఊటూర్, గట్టుదుద్దెనపల్లి గ్రామాల్లోని ప్రజలకు నీటి సరఫరాలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి.
- గ్రామాలలో పైప్‌లైన్ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండటంతో తరచూ లీకేజ్‌లతో నీరంతా వృథాగా పోతోంది. లీకేజీలతో నీరంతా కలుషితమై రంగుమారి వస్తుండటంతో నీటిని ఉపయోగించడానికి ప్రజలు విముఖత చూపుతున్నారు.
- పల్లెల్లో వ్యవసాయబావులకు సంబంధించి విద్యుత్ మోటార్లు వాటర్ ట్యాంకులకు ఉండటంతో నీటి సరఫరాలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి.
- పైపులైన్ వ్యవస్థ కొలతలకు విరుద్ధంగా వేయడంతో భూమి ఎత్తు పల్లాలతో ట్యాంకులకు సరైన సమయంలో నీరందక పోవడంతో ట్యాంకులు పూర్తి స్థాయిలో నిండటం లేదు
- సమయపాలన లేకుండా ఇష్టారీతిన నీటిని సరఫరా చేయడంతో నీరంతా వృథా అవుతోంది.
- తరచుగా ట్యాంకులు లీకై నీరంతా రోడ్డుమీదికి రావడంతో వాహనదారులు, ప్రయాణికులు, ప్రజలు అవస్థలు పడటమే కాకుండా ప్రమాదాలకు గురవుతున్నారు.
- ఏళ్లు గడిచినా, పథకం పూర్తయ్యిందని అధికారులు చెబుతున్నా ఇంకా నీరు అందని ప్రజలు అరిగోస పడుతున్నారు.
- నీరుశుద్ధిగా లేకపోవడంతో ప్రజలు గ్రామాల్లోని నాసిరకం మినరల్ వాటర్ ప్లాంట్లను ఆశ్రయించి తాగునీరు కొనుగోలు చేస్తున్నారు.
- గ్రామాల్లో గేట్‌వాల్వ్‌లు నిర్మించిన చోట పైకప్పు వేయక పోవడంతో జంతువులు, ప్రజలు ప్రమాదాల బారిన పడుతున్నారు.
- ఇప్పటికైనా అధికారులు స్పందించి శుభ్రమైన నీరు అందించి ప్రజలకు తాగునీటి కష్టాలను తీర్చాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

శుద్ధమైన నీరు అందించాలి



మిషన్ భగీరథ పైపుల ద్వారా శుద్ధమైన నీరు ప్రజలకు అందించాలి. మంచినీటిని సరఫరా చేస్తేనే ప్రజలు సేవిస్తారు. నీటి సరఫరాలో సిబ్బంది సమయపాలన పాటించాలి, ఇష్టానుసారంగా వ్యవహరించొద్దు.

– ఆర్.లత, గృహిణి, మానకొండూర్

తాగడానికి వాడటం లేదు



మిషన్ భగీరథ నీటిపై ప్రజలకు అవగాహన కల్పించాలి. పల్లె ప్రజలు నిత్యావసరాలకు మాత్రమే భగీరథ నీరు వాడుతున్నారు. తాగడానికి వాడటం లేదు. సరఫరా చేసే నీటి ప్రాముఖ్యతను ప్రజలకు వివరించాలి.

– అవరాజు శ్రీనివాస్, కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు

నీరంతా వృథా అవుతోంది



తరచూ లీకేజీ అవుతున్న పైపులైన్లకు మరమ్మతు చేయాలి. లీకేజీలతో నీరు రంగు మారి వస్తుండటంతో ప్రజలు నీటిని వినియోగించడానికి విముఖత చూపుతున్నారు. లీకేజీలతో నీరంతా వృథా అవుతోంది.

– అంకూష, పాన్‌షాప్

చర్యలు తీసుకుంటాం

లీకేజీలను గుర్తించి మరమ్మతు చేస్తాం. నీటి సరఫరాలో సమయపాలన పాటించాలని సిబ్బందికి సూచిస్తాం. భగీరథ నీటి ప్రజలలో ఉన్న అపోహను తొలగించి, సేవించడానికి అవగాహన కల్పిస్తాం. వాటర్ ట్యాంక్, ఇళ్లకు సరిపడా నీరు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకుంటాం.

– శిరీష, ఏఈ, మిషన్ భగీరథ

ఐఎస్‌ఏ ఫెస్టివల్‌లో శంకర్ శిల్పం

సప్తగిరికాలనీ(కరీంనగర్): ఉమ్మడి కరీంనగర్ జిల్లా, ప్రస్తుత పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం కుక్కలగూడూరు గ్రామానికి చెంది కరీంనగర్‌లో నివాసముంటున్న సైకత శిల్పి రేవెల్లి శంకర్ ఒడిస్సా రాష్ట్ర టూరిజం శాఖ నిర్వహిస్తున్న ఇంటర్నేషనల్ సాండ్ ఆర్ట్ ఫెస్టివల్లో రెండోరోజు శనివారం కోణార్క్ దేవాలయ సమీపంలో గల చంద్రభాగా నదీతీరంలో ఎకో టూరిజం అంశంపై సైకత శిల్పాన్ని రూపొందించి అభినందనలు అందుకున్నారు. అడవి, ఏనుగులు, చెట్లు, ఆహ్లాద వాతావరణంతో కూడిన శిల్పం అందరినీ ఆకట్టుకుంది.

డిగ్రీ విద్యార్థులకు పుస్తకాలు



ఇంగ్లిష్ నోట్స్ ఆవిష్కరిస్తున్న అధ్యాపకులు

కొత్తపల్లి: శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలోని డిగ్రీ విద్యార్థులకు ఉచితంగా పంపిణీ చేయనున్న ఇంగ్లిష్ నోట్స్‌ను శనివారం సీతారాంపూర్‌లో ఆవిష్కరించారు. హమ్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు, అధ్యాపకుడు ధనపూరి సాగర్ తయారు చేసిన డిగ్రీ మూడో సెమిస్టర్ నోట్స్‌ను ప్రభుత్వ మహిళా డిగ్రీ, పీజీ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ డా.అనంతం విడుదల చేశారు. శాతవాహన యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ కళాశాలలో 3వ సెమిస్టర్ చదువుతున్న విద్యార్థులకు ఈ నోట్స్ ఎంతగానో ఉపయోగపడుతుందని, సులభంగా అర్థం చేసుకొని పరీక్షల్లో ఉత్తమ మార్కులు పొందేందుకు దోహదపడుతుందని అనంతం తెలిపారు. ఈ ఇంగ్లిష్ పుస్తకాలను ఉచితంగా పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేసినట్లు సాగర్ చెప్పారు. దూర ప్రాంత విద్యార్థులు ఈ నోట్స్‌ను పొందాలంటే 8885549467 నెంబర్‌కు వాట్సాప్ ద్వారా కోరితే వారికి పీడీఎఫ్ రూపంలో పంపిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డా.గుండా శ్రీనివాస్, ఆంగ్ల అధ్యాపకులు గుమ్మడి కుమారస్వామి, కుంటాల శ్రీనివాస్, జె.రమణ, ముని గోపాల్ పాల్గొన్నారు.

అయ్యప్ప స్వాములకు భిక్ష



దాతలను సన్మానిస్తున్న గురుస్వాములు

జమ్మికుంట: పట్టణంలోని శ్రీఅయ్యప్పస్వామి దేవాలయంలో మండల పూజ మహోత్సవంలో భాగంగా శనివారం దాతల సహకారంతో అయ్యప్పస్వాములకు మహాభిక్ష కార్యక్రమం నిర్వహించారు. దాతలు రూ.5,116 సిరిమల్ల జయందర్ గురుస్వామి సుజన, చిన్ని వెంకట్‌రెడ్డి చరిత, చెరుకు భాస్కర్‌రెడ్డి వసంత, తోట లక్ష్మణ్ కవిత, భిక్షదాతలు రూ.3,116 పురం శంకర్, వంగ రాజిరెడ్డి మధుమిత, బూరుగుల కుమారస్వామి రమ్య సహకారంతో భిక్ష కార్యక్రమం నిర్వహించామని సేవా సమితి గురుస్వాములు తెలిపారు. ఈ సందర్భంగా గురుస్వామి ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం భిక్ష దాతల సహకారంతో మండల పూజ మహోత్సవం సమయంలో జనవరి వరకు ప్రతిరోజు ఉంటుందని, దాతల చేయూత వల్ల దేవాలయం నిర్వహణ అయ్యప్పస్వామి కృపవల్ల జరుగుతుందన్నారు. అనంతరం దాతలను సన్మానించి, స్వామివారి తీర్థప్రసాదాలు ఆశీస్సులు అందజేశారు. భక్తులు ముందుకు వచ్చి స్వామివారి కటాక్షములు పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో అయ్యప్పస్వామి సేవా సమితి కమిటీ సభ్యులు, గురుస్వాములు మామిడాల మనోహర్, జగదీశ్వర్, వెంకట్‌రెడ్డి, మారుతి, ఎల్లారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు

మానకొండూర్‌రూరల్: మండలంలోని శ్రీనివాస్‌నగర్‌లో మహాలక్ష్మి, భూలక్ష్మి సహిత బొడ్రాయి ప్రతిష్ఠాపన చేసి ఏడాది పూర్తయిన సందర్భంగా శనివారం అర్చకుల ఆధ్వర్యంలో గ్రామస్తులు ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకుడు గడ్డం నాగరాజు పాల్గొని భక్తి, శ్రద్ధలతో అమ్మవార్లకు మొక్కులు చెల్లించారు. ఈసందర్భంగా నాగరాజును ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు శాలువాతో సన్మానించారు. ఈకార్యక్రమంలో కొట్టె నరేశ్, రవీందర్, రవి, గ్రామప్రజలు పాల్గొన్నారు.



గ్రామస్తులు, పూజారుల సమక్షంలో పూజలు చేస్తున్న గడ్డం నాగరాజు

ముందస్తు క్రిస్మస్ వేడుకలు



క్యాండిల్స్ వెలిగించి ప్రార్థనలు చేస్తున్న పాస్టర్లు

చొప్పదండి: మండల కేంద్రంలోని హోలీషాలోం చర్చిలో ముందస్తు క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. బిషప్ గుండేటి శాంతికుమార్ వేడుకలను ప్రారంభించి మాట్లాడారు. ప్రజలందరు ప్రేమ, సమాధానంతో కూడిన జీవన విధానం మానసిక, శారీరక ఆరోగ్యాన్ని ప్రసాదిస్తుందన్నారు. ఈసందర్భంగా చిన్నారుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాస్టర్లు,తదితరులు పాల్గొన్నారు.

వానరాలతో పరేషాన్



వీధిలో తిరుగుతున్న వానరాలు



ఇంటిపై కోతులు

- వీధుల్లో రచ్చరచ్చ చేస్తున్న వైనం
- బెంబేలెత్తుతున్న ప్రజలు, చిన్నారులు

సప్తగిరికాలనీ(కరీంనగర్): కరీంనగర్ స్మార్ట్ సిటీ కొన్ని రోజుల నుంచి కోతుల బెడదతో నానా తంటాలు పడుతోంది. సిటీలోని పలు వీధుల్లో వానరాలు బీభత్సం సృష్టించడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో వీధుల్లో కుక్కల బెడద ఉండగా.. ఇటీవల కాలంలో తగ్గింది. తీరా కుక్కల బెడద తగ్గిందని అనుకున్న సిటిజన్లకు అంతలోనే కోతుల బెడద వచ్చి పడింది. వీధుల్లోని ఇళ్లలోకి కోతులు చొరబడి రచ్చరచ్చ చేస్తున్నాయని, ఎదురు తిరిగితే పైకి వచ్చి కొరుకుతున్నాయని వాపోతున్నారు. హోటళ్లు, పండ్ల దుకాణాలు తదితర వ్యాపార కేంద్రాల్లో కోతులు చొరబడి నానా బీభత్సం సృష్టిస్తున్నాయంటున్నారు. నగరపాలక సంస్థ అధికారులు చొరవ తీసుకొని కోతుల బెడద నుంచి తప్పించాలని కోరుతున్నారు.

గుంపులుగుంపులుగా..

నగరంలోని చాలా డివిజన్లలో కోతులు గుంపులుగుంపులుగా తిరుగుతున్నాయి. ఒకేసారి సుమారు 50కి పైగా కోతులు ఒక్కసారిగా ఇళ్ల, రేకులపైకి ఎక్కి చిందరవందర చేస్తున్నాయి. ఇలా చాలా వీధుల్లో కూడా ఇదే పరిస్థితి ఉందని వాపోతున్నారు. కోతులను కట్టిపడేసే మార్గం లేదా అంటున్నారు పలు కాలనీల వాసులు. కోతులు తమ పిల్లలపైకి వచ్చి ఇబ్బంది పెడుతున్నాయంటున్నారు. అధికారులు కోతులన్నింటిని వేరే చోటుకి పంపించే ప్రయత్నాలు చేపట్టాలని కోరుతున్నారు.

పిల్లలు భయపడుతున్నరు



పెద్ద సంఖ్యలో కోతులు వచ్చేసరికి మా కాలనీలోని పిల్లలందరూ భయపడుతున్నరు. ఒకటి, రెండు వస్తే సంతోషంగా ఉంటున్నరు. గుంపులుగా వచ్చి ఇష్టమచ్చినట్లు వ్యవహరిస్తూ నానా బీభత్సం సృష్టించడంతో జంకుతున్నరు.

- శేఖర్, రాంనగర్

ఇంటిపై ఉంటున్నయ్



కోతులన్నీ ఒకేసారి గుంపులుగుంపులుగా వస్తున్నయ్. ఇంటిపైనే ఉంటూ మా రేకులపై ఎగిరి దూకుతున్నయ్. ఇంటిపైనే గంటల తరబడి సుమారు 20కి పైగా కోతులు తిరుగుతున్నయ్. నగరపాలక సంస్థ అధికారులు కోతుల బెడద నుంచి కాపాడాలి.

- అరవింద్, పద్మనగర్

అధికారులు చొరవ తీసుకోవాలి



గతంలో కుక్కల బెడద ఉండేది. ఇప్పుడు లేదు. మళ్లీ కోతుల గుంపు వచ్చింది. పెద్ద సంఖ్యలో వచ్చాయి. ఇంటి తలుపు తీసి ఉంటే చాలు.. ఇంట్లోకి వచ్చి చిందరవందర చేస్తున్నయ్. నగరపాలక సంస్థ అధికారులు వెంటనే చొరవ తీసుకుని కోతుల బెడద నుంచి తప్పించాలి.

- ప్రవీణ్, గోదాంగడ్డ



సాక్షి ఎఫెక్ట్

నగరవ్యాప్తంగా ఫాగింగ్

కరీంనగర్‌కార్పొరేషన్: దోమల నియంత్రణకు నగరపాలక సంస్థ శనివారం ఫాగింగ్ చేపట్టింది. నగరంలో దోమలు విపరీతంగా పెరిగిపోయి ప్రజలు వ్యాధులబారిన పడుతున్న వైనంపై 'పారిశుధ్యంపై పట్టింపేది.. జాడ లేని ఫాగింగ్' పేరిట ఈనెల 1న వచ్చిన సాక్షి కథనంపై అధికారులు స్పందించారు. రాంనగర్, ముకరాంపుర, కాశ్మీర్‌గడ్డ, హౌసింగ్ బోర్డుకాలనీ తదితర ప్రాంతాల్లో శానిటేషన్ సిబ్బంది ఫాగింగ్ నిర్వహించారు. ఫాగింగ్ నిర్వహించినట్లు ఆయా కాలనీవాసుల నుంచి సంతకాలు కూడా సేకరించారు. ఫాగింగ్ నిరంతరం చేపట్టి దోమలను పూర్తిగా నిర్మూలించాలని ప్రజలు అధికారులను కోరుతున్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ

కరీంనగర్: పెద్దపెల్లి జిల్లా యైటింక్లయిన్‌కాలనీ అంబేద్కర్ స్టేడియంలో జరిగిన డాడ్జ్ బాల్ టోర్నమెంట్‌లో కరీంనగర్ జిల్లా కోరా ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు పాల్గొని ప్రతిభ కనబరచడంతో పాటు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. కౌశిక్, రిషి, అభినయ్, అక్షిత్‌సాయి, గీతిక, శ్రీనిధి, హారిక, పూజితను పాఠశాల చైర్మన్ మహిపాల్‌రెడ్డి, డైరెక్టర్లు వరప్రసాద్, రాంరెడ్డి, సింహాచలం హరికృష్ణ, వంగళ సంతోష్‌రెడ్డి పుష్పగుచ్ఛంతో అభినందించారు. శిక్షణ ఇచ్చిన పీఈటీ దుర్గరాజు, విద్యార్థుల తల్లిదండ్రులను అభినందించారు.